# 111. అల్ లహబ్ (అగ్నిజ్వాల) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్(సఅసం) పట్ల అవిశ్వాసుల తీవ్రవిద్వేషాన్ని ప్రస్తావించింది. మొదటి ఆయతులో వచ్చిన 'లహబ్' (అగ్నిజ్వాల) అన్న ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా ప్రవక్త (సఅసం) పెదనాన్న గురించి ప్రస్తావించింది. అతడి అహంకారాన్ని, సంపద చూసుకుని గర్వించడాన్ని, అబూలహబ్ భార్య ప్రవక్త ముహమ్మద్(సఅసం) పట్ల ప్రదర్శించిన తీవ్రమైన ద్వేషాన్ని తెలియజేసింది. అబూలహబ్, అతడి భార్య ఇద్దరికీ పరలోకంలో తీవ్రమైన శిక్ష తప్పదని తెలిపింది.

## 111. అల్ లహబ్[1] సూరా

అవతరణ :మక్కా ఆయతులు :5

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

**1** అబూ లహబ్ చేతులు రెండూ విరిగి పోయాయి. వాడు సయితం నాశనమై పోయాడు.[2]

سُوْرَةُ تَبَّتْ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

تَبَّتْ يَدَآ اَبِيْ لَهَبٍ وَّتَبَّ ①

1. ఈ సూరాను **'సూరతుల్ మసద్'**, **'సూరయె తబ్బత్'** అని కూడా అంటారు.
**పూర్వరంగం:** బంధుమిత్రులకు దైవధర్మాన్ని పరిచయం చేయమని దేవుడు తన ప్రవక్త (సఅసం)కు ఆదేశించినపుడు, ఆయన (స) 'సఫా' కొండపైకెక్కి "యా సబాహా!" అని బిగ్గరగా నినదించారు. ఇలాంటి పిలుపును అరబ్బులు ప్రమాద సంకేతంగా తలపోసేవారు. అందుకే అందరూ హడావిడిగా అక్కడికి తరలివచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) అందరినీ ఉద్దేశించి, "ఈ పర్వతానికి ఆవలివైపున ఒక అశ్వదళం మనపై దండెత్తడానికి సిద్ధంగా ఉందని నేను చెబితే మీరు నమ్ముతారా?" అని అడిగారు. "ఎందుకు నమ్మము?! నువ్వు ఎన్నడూ అబద్ధం చెప్పినట్లు మేమెరుగము" అన్నారంతా ముక్తకంఠంతో. "అయితే వినండి! నేను మిమ్మల్ని ఒక పెద్ద శిక్ష గురించి భయపెట్టడానికి వచ్చాను. మీరు గనక ఈ అవిశ్వాసాన్ని, బహుదైవారాధనను మానుకోకపోతే మీకు శిక్ష తప్పదు" అని ఆయన (స) చెప్పారు. ఇది విని అబూ లహబ్ మండిపడ్డాడు. "నువ్వు నాశనమవ్వ! ఇది చెప్పటానికేనా నువ్వు మమ్మల్ని పిలిచింది?!" అని అవహేళన చేశాడు. దీనిపై అల్లాహ్ ఈ సూరాను అవతరింప జేశాడు. (సహీహ్ బుఖారీ – సూరయె లహబ్).

   అబూలహబ్ అసలు పేరు అబ్దుల్ ఉజ్జా. తన అందచందాల రీత్యా, దేదీప్యమానమైన ముఖవర్చస్సు దృష్ట్యా అతను అబూలహబ్ (జ్వాలాముఖి)గా పిలువబడేవాడు. ఇకపోతే; పరిణామం రీత్యా కూడా అతడు అగ్నిజ్వాలలకే ఆహుతి కావలసి ఉన్నది. చూడబోతే అతడు మహాప్రవక్త (సఅసం)కు స్వయాన పినతండ్రి. కాని సైద్ధాంతికంగా మాత్రం మహాప్రవక్త (స)కు బద్ధవిరోధి. అతని భార్య ఉమ్మె జమీల్ కూడా శత్రుత్వంలో భర్తకు ఏమాత్రం తీసిపోదు.

2. సాధారణంగా పెద్ద నష్టం సంభవించినప్పుడు చేతులు విరిగిపోయాయి అంటారు. అబూలహబ్ పతనాన్ని సూచించే పలుకులు ఇవి. వాడు మహాప్రవక్త (సఅసం)ను శపించిన సంగతి తెలిసిందే. కాని దేవుడు వాడి శాపాన్ని వాడిపైన్నే తిప్పికొట్టాడు. అంతేకాదు, చాలా శీఘ్రంగానే వాడు చావనున్నాడన్న సంగతి కూడా ఈ సూరాలో

مَآ اَغۡنٰى عَنۡهُ مَالُهٗ وَمَا كَسَبَ ۝٢

**2** వాడి ధనంగానీ, వాడి సంపాదన గాని వాడికేమాత్రం పనికిరాలేదు.[3]

سَيَصۡلٰى نَارًا ذَاتَ لَهَبٍ ۝٣

**3** త్వరలోనే వాడు భగ భగ మండే అగ్నికి ఆహుతి అవుతాడు.

وَّامۡرَاَتُهٗ ؕ حَمَّالَةَ الۡحَطَبِ ۝٤

**4** ఇంకా అతని భార్య, పుల్లలు మోసేఆమె కూడా[4] (నరకానికి పోతుంది).

فِىۡ جِيۡدِهَا حَبۡلٌ مِّنۡ مَّسَدٍ ۝٥

**5** ఆమె మెడలో (ఖర్జూర ఆకుతో) గట్టిగా పేనిన ఒక త్రాడు ఉంటుంది.[5]

తెలుపబడింది. చెప్పినట్లే జరిగింది కూడా. బద్ర్ యుద్ధం జరిగిన కొన్నాళ్ళకే వాడు ప్లేగు లాంటి ఒక విచిత్రమైన రోగంతో, కుళ్ళి, కృశించి చచ్చాడు. అతని కుటుంబ సభ్యులెవరూ అతని దగ్గరకు పోలేదు. మూడు రోజుల వరకూ శవం అలాగే పడి ఉండింది. కుళ్ళి కంపుకొట్ట సాగింది. ఎట్టకేలకు అతని కొడుకులు అంటు వ్యాధులు వ్యాపిస్తాయేమోనన్న భయంతో అసహ్యించుకుంటూనే అల్లంత దూరం నుంచి అతని శరీరంపై రాళ్లు మట్టివేసి పూడ్చివేశారు. (ఐసరుత్తఫాసీర్).

3. **'సంపాదన'**లో అతని పదవులు, పరువుప్రతిష్ఠలు, సంతానం – అన్నీ చేరివున్నాయి. అంటే దేవుడతన్ని శిక్షించదలచుకున్నప్పుడు అతని ఆస్తిపాస్తులుగానీ, ఆలుబిడ్డలుగానీ, అధికారాలుగానీ ఏమీ ప్రయోజనకరం కాలేకపోయాయి.

4. అంటే ఆమె నరకంలో కట్టెలు మోసుకుంటూ వచ్చి తన భర్తను (అబూ లహబ్) కాల్చే అగ్నిపై వేస్తూ ఉంటుంది. దాంతో ఆ అగ్ని మరింతగా మండుతుంది. ఇదంతా దేవుని తరఫున విధించబడినది. ఎందుకంటే ఆమె ఇహలోకంలో భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ విశ్వాసులను అవమానపరిచేది. పరలోకంలో కూడా తన భర్తను శిక్షించటంలో తోడ్పడుతుంది (ఇబ్నె కసీర్). మరికొన్ని ఆధారాల ప్రకారం ఆమె (ఇహలోకంలో) ముళ్ళచెట్లు మోసుకుంటూ వచ్చి దైవప్రవక్త (స) మార్గంలో వేసేది. వేరొక ఆధారం ప్రకారం చాడీలు చెప్పే దురలవాటును ఎత్తిచూపటానికి ఇలా అనబడింది. ఈమె ఖురైషు అవిశ్వాసుల వద్దకు వెళ్ళి దైవప్రవక్త (స)ను పరోక్షంగా నిందించేది. దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా జనులను రెచ్చగొట్టేది. (ఫత్హుల్ బారీ).

5. **'జీద్'** ( جِيۡدِ ) అంటే మెడ అనీ, **'మసద్'** అంటే బాగా పేనిన త్రాడు అనీ అర్థం. ఈ త్రాడు గురించి కూడా విభిన్న వ్యాఖ్యానాలున్నాయి. వాటన్నింటినీ అలా ప్రక్కన పెట్టి ఆలోచిస్తే నరకంలో ఇది ఆమె దురవస్థను సూచిస్తుంది.